

క్వారీల్లో తనిఖీలు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 17: నంద్యాల, కర్నూలు జిల్లాలోని పలు క్వారీలను గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సమక్షంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. డోన్ మండలం చిన్న మల్కాపురంలో డోలమైట్, వెల్దుర్తి మండ లం కలుగోట్లలో ఎల్లో ఓకర్ మైనింగ్‌కు సంబంధించిన రెండు క్వారీలను విజి లెన్స్ ఇన్‌స్పెక్టర్ మురహరితోపాటు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తమకు కేటాయించిన లీజు ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా తవ్వకాలు జరుపుతున్నారా? అనే కోణంలో పరిశీలించారు. ఎవరైనా నిబంధనలు అతిక్ర మిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డైరెక్టర్ హెచ్చరించారు.

45 టీఎంసీలు కడలిపాలు..!



కర్నూలు జిల్లా నందవరం మండలంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు చికలడోణ ఎత్తిపోతల పథకం

- కళ్ల ముందే నీళ్లున్నా.. ఎత్తిపోసుకోలేని వైనం
- గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు ధ్వంసం
- కాపర్ వైర్, కాయిన్స్ దోపిడీ విలువ రూ.5.60 కోట్ల పైమాటే
- దర్యాప్తులో కానరాని పురోగతి

కర్నూలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయి 45 టీఎంసీల నీరు పైగా కడలిపాలైంది. ఆ నీరంతా మన జిల్లా మీదుగా కృష్ణా నదిలో కలిసి అక్కడి నుంచి సముద్రం పాలవుతోంది. కళ్లెదుటే లక్షల క్యూసెక్కుల వరద తరలిపోతున్నా ఒక్క చుక్క నీరు కూడా ఎత్తిపోసి నిల్వ చేసుకోలేదని దారుణ పరిస్థితి ఏర్పడింది. రూ.వందల కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌ల్లో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానెల్ బోర్డులు ధ్వంసం చేయడమే కారణం. రూ.5.60 కోట్లకు పైగా విలువ చేసే కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకువెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. దొంగలు మాత్రం దొరకలేదు. నిధులు లేక మరమ్మతులు చేయలేదు. తుంగభద్ర నదిలో వరద పరవళ్లు తొక్కుతున్నా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.



చిలకలదోణ ఎత్తిపోతల పథకం స్టేజ్-1 పంప్ హౌస్‌లో ప్యానెల్ బోర్డులు పగులగొట్టి కాపర్ వైర్ దొచుకెళ్లిన దుండగులు

ఆ దొంగలు ఎవరు..?

దోపిడీకి గురైన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు కోసిగి, మాధవరం, నందవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో వస్తాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానెల్ బోర్డులు ధ్వంసం చేసి రూ.కోట్లు విలువ చేసే కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దొంగలించారని జీఆర్‌పీ ప్రాజెక్టు ఇంజనీర్లు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికే 10-15 రోజులు గడిచింది. ఎత్తిపోతల పథకాలు ధ్వంసం చేసిన దుండగులు ఎవరన్నది ఇప్పటికీ పోలీసులు గుర్తించలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫిర్యాదు ఇచ్చారు.. కేసు పెట్టాం..! అన్నట్లు ఉందే తప్పా పోలీసులు కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. అయితే దొంగలను గుర్తించడానికి రెండు బృందాలు ఏర్పాటు చేశామని అంటున్నారే తప్పా ఫలితం కనిపించడం లేదు. దోపిడీ జరిగిన మాధవరం స్టేజ్-2 పంప్‌హౌస్ హౌస్ వద్ద పోలీసులు గుర్తించిన ఓ చొక్కాపై కర్ణాటక రాష్ట్రం శక్తినగర్‌కు చెందిన ఓ టైలర్ లేబుల్ ఉంది. కర్ణాటక, తెలంగాణకు చెందిన ముఠా ఈ దోపిడీకి పాల్పడిందని అనుమానిస్తున్నారే తప్పా ఆ కోణంలో దర్యాప్తు వేగం పుంజుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తుంగభద్ర నది నుంచి 3.786 టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 45,790 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. 2003లో అప్పటి మంత్రి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి నాటి సీఎం చంద్రబాబును ఒప్పించి ఈ ప్రాజెక్టును సాధించారు. కోసిగి, మంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కల్లూరు మండలాల్లో ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మూగలదొడ్డి, పులచింత, చిలకలడోణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. ప్యాకేజీ-97 కింద మాధవరం, బసలదొడ్డి, దుద్ది ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. వీటితో పాటుగా రూ.255 కోట్లు ఖర్చు చేసి పులికనుమ ప్రాజెక్టు, రూ.119 కోట్లు ఖర్చు చేసి పులకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మించారు. దాదాపుగా రూ.616 కోట్లు ప్రజాధనం ఖర్చు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వహణకు ఐదేళ్లు ఒక్కపైసా నిధులు ఇవ్వలేదు. ఫలితంగా ఆపరేటర్లు, వాచ్‌మెన్లకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. దీంతో కాపలా లేకపోవడాన్ని గుర్తించిన గుర్తు తెలియని దుండగులు ప్రక్కా ప్రణాళికతో మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్ దగ్గర 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 14 ధ్వంసం చేశారు. మాధవరం స్టేజ్-1 లిఫ్ట్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానెల్ బోర్డులు, స్టార్టర్లు, బసలదొడ్డి స్టేజ్-1 పంప్‌హౌస్‌లో ప్యానెల్ బోర్డులు ధ్వంసం చేసి కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. వాటిని తక్షణ మరమ్మతులకు రూ.5.60 కోట్లు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. అంతేకాకుండా ఎత్తిపోతల వారిగా శాశ్వత మరమ్మతులు కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

గుర్తు తెలియని దుండగుల చేతిలో ధ్వంసమైన జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాలు మరమ్మతుల కోసం రూ.5.60 కోట్లు నిధులు కావాలని ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ చేపడుతాం. అలాగే వివిధ ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లలో విద్యుత్ మోటటార్లు పని చేయడం లేదు. శాశ్వత మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.

\- భాస్కరరెడ్డి, ఈఈ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు



మాధవరం స్టేజ్-2 ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన ప్యానెల్ బోర్డులు





మాధవరం స్టేజ్-1 పంప్‌హౌస్..

కళ్ల ముందే నీళ్లు.. తప్పని కన్నీళ్లు..!

తుంగభద్ర నదికి జూలై నెలలోనే వరద మొదలైంది. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేద్దామని ఇంజనీర్లు పంప్‌హౌస్‌ల వద్దకు వెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానెల్ బోర్డు ధ్వంసం, దోపిడీ వెలుగు చూసింది. దీంతో ఒక్క లిఫ్టు నుంచి కూడా నీటి ఎత్తిపోసుకోలేని పరిస్థితి ఉంది. ఈ నెల 10న రాత్రి తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేటు చైన్‌లింక్ తెగిపోయి గేట్టు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో డ్యాంలో 105.788 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. అలాగే 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేది. గేటు కొట్టుకుపోవడంతో డ్యాంను ఖాళీ చేసేందుకు రోజూ సరాసరి లక్ష క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. అంటే రోజుకు 8 టీఎంసీల చొప్పున సుమారు 45 టీఎంసీలు జిల్లా సరిహద్దులు దాటి శ్రీశైలం జలాశయం మీదుగా సముద్రంపాలవుతోంది.



గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు చోరికి గురికాకుండా ఉండిఉంటే ఈ వారం పది రోజులు ఎంత తక్కువ కాదన్నా ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేది. ఈ సీజన్‌లో పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోసి వివిధ జలాశయాల్లో నిల్వ చేయడానికి అవకాశం ఉన్నా.. గుర్తు తెలియని దుండగుల దోపిడీ కారణంగా లిఫ్టులు నిరుపయోగంగా మారడంతో నీళ్లున్నా.. కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఒక టీఎంసీ నీటి విలువ రూ.100 కోట్లతో సమానమని ఓ ఇంజనీరు పేర్కొన్నారు. తుంగభద్ర డ్యాంలో వీలైనంతగా నీటిని కాపాడుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, వందల మంది నిపుణులు, ఇంజనీర్లు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. అదే స్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దుండగుల చేతిలో ధ్వంసమైన జీఆర్‌పీ లిఫ్టులు మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

- బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావం
- వేసవిని తలపిస్తున్న వానాకాలం
- 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 17: విపరీత కాలం అంటే ఇదేనేమో.. వానాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత సంవత్సరం వేసవి కాలంలో మాదిరిగా ఎండలు కాయడంతో జనాలు అల్లాడిపోతున్నారు. బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడన ద్రోణి ప్రభావం ఇందుకు కారణమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో వైపు గాలిలో తేమ పెరగడంతోపాటు భారీ వర్షాలకు సూచనగా కూడా చెప్పుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాలో 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు పంటలు ఎండిపోతుంటే రైతులు తట్టుకోలేకపోతున్నారు. కర్నూలు జిల్లాలో మూడు లక్షల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 2.50 లక్షల హెక్టార్లలో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి తదితర పంటలను సాగు చేశారు. ఎండల ప్రభావంతో వర్షాధారంపై ఆధారపడిన పంటలు ఎండిపోతున్నాయి. వానలు కురవాలని వరుణదేవుడిని వేడుకుంటున్నారు.



జోహరాపురంలో ఎండ వేడిమిని భరించలేక రక్షణగా గొడుగు

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

మంత్రాలయం, ఆగస్టు 17: రాఘవేంద్ర స్వామి ఉత్సవాల ప్రారంభ ఏర్పాట్లను శనివారం రాత్రి ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, ఆదోని డీఎస్పీ సోమన్నలు తహసీల్దార్ రవిలు పరిశీలించారు. అనంతరం స్వామీజీతో సమావేశమై ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాలతోపాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాకకు సంబంధించి వీఐపీల ప్రొటోకాల్‌పై చర్చించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, బందోబస్తు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వీరికి రాఘవేంద్రస్వామి మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ పరిశీలనలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, సీఐ రామాంజులు, ఎస్ఐ గోపినాథ్, ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



పీఠాధిపతితో ఉత్సవాలపై మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, డీఎస్పీ సోమన్న

వైద్యులకు రక్షణ లేదా?

- కదం తొక్కిన జూడాలు, మెడికోలు
- భారీ ర్యాలీ



మానవహారం నిర్వహిస్తున్న మెడికోలు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 17: జాతీయ స్థాయిలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని జూనియర్ డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులకు రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేయడంతో పాటు కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు కదం తొక్కారు. ముందుగా శనివారం కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూడాల సంఘం నేతలు డాక్టర్లు అచ్యుత్, తనూజ్ మాట్లాడుతూ వైద్యులను దేవుళ్లతో పోలుస్తారనీ, వారిపైనే అత్యాచార ఘటనలకు పాల్పడితే ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వైద్యులకు సంపూర్ణ రక్షణను ఇచ్చేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లు నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రభుత్వ వైద్యులతోపాటు ఐఎంఏ, స్వచ్ఛంద సంస్థలు, వామపక్ష సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అదేవిధంగా కర్నూలు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం సంఘీభావం ప్రకటించింది. ఉదయం ప్రభుత్వ డాక్టర్లు నిరసన శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. ఏపీజీడీఏ సంఘం నాయకులు డాక్టర్ రాంశివనాయక్, జయరాం, శ్రీనివాసులు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న న్యాయమైన సమ్మె కోర్కెలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలన్నారు.

వైద్య విద్యార్థినికి నివాళి : కోల్‌కత్తాలోని ట్రైనీ డాక్టర్ హత్యను నిరసిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ ఈ నిరసనలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఏవో కే.అరుణ, డెమో సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విద్యాధరి



కర్నూలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా 2021వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గొబ్బిళ్ల విద్యాధరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న భార్గవ్‌తేజను ఇటీవల బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

23న గ్రామ సభలు

- 20 నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్
- వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (కలెక్టరేట్), ఆగస్టు 17: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23న జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, ఉపాధి హామీ తదితర అంశాలపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో కేటాయించిన లక్ష్యాలను సాధించే దిశగా మండల, జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సదస్సులకు ముందు ఆర్‌వోఆర్ యాక్టు నియమ నిబంధనలను పూర్తి స్థాయిలో చదవాలన్నారు. సీసీఎల్‌ఏలో పని చేస్తున్న సమయంలో భూ సమస్యలను సంబంధించి సుమారుగా వేయి ఎఫ్ఏక్యూ (ఫ్యాక్) లను తయారు చేసే అన్ని మండలాల తహసీల్దార్లకు పంపామన్నారు. సదస్సులకు వెళ్లే సమయంలో ఆర్‌వోఆర్, 1బీ, అడంగల్, పాత ఆర్‌వోఆర్, రీసర్వే డేటా, ఆర్ఎస్ఆర్, విలేజ్ మ్యాప్, సెటిల్మెంట్ రికార్డు తదితర రికార్డులను అన్ని తీసుకుని వెళ్లాలని తహసీల్దార్లను ఆదేశించారు. 20వ తేదీ నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ప్రక్రియ ప్రారంభించాలని ఈఆర్వో, ఏఈ ఆర్వోలను ఆదేశించారు. 2025 సంవత్సరం జనవరి 26నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించిన 100 రోజుల ప్రణాళికలో లక్ష్యంగా నిర్ణయించుకున్న 6,079 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జాబ్ కార్డులు ఉన్న వారికి ఇతర జిల్లాల్లో 70 శాతం, 60 శాతం పనులు కల్పిస్తుంటే కర్నూలు జిల్లాలో 50 శాతం సాధించామని అసంతృప్తి వ్యక్తం చేశారు.


సెప్టెంబరు 15లోపు ఈక్రాప్ పూర్తి కావాలి : జేసీ

ఈక్రాప్ బుకింగ్‌కు సంబంధించి సెప్టెంబరు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశించారు. వీఏఏ, ఎంఏవోతోపాటు వీఆర్‌ఏలు త్వరితగతిన ఈక్రాప్ బుకింగ్ పూర్తయ్యేలా చూడాలన్నారు. కౌలుదారు పేరు కూడా తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ కనిపించాలన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

సర్వపాప హరణం
రాఘవనామ స్మరణం





- ఉత్సవాలకు ముస్తాబైన శ్రీమఠం
- నేటి నుంచి 353వ సప్తరాత్రోత్సవాలు
- 22న స్వామివారి మహా రథోత్సవం
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 17:

పవిత్ర తుంగభద్ర నదీ తీరంలో వెలసిన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మహిమాన్వితుడిగా మూలబృందావనం రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. నిత్యం వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు భక్తులకు ఆహ్వానం పలుకుతున్నాయి. సంధ్యావేళల్లో వీచే చల్లని గాలులతో రాఘవేంద్రస్వామి నామస్మరణతో మంత్రాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. పుణ్యక్షేత్రంలో భక్తజనం ఆధ్యాత్మికత, ఆహ్లాదకరాన్ని పొందుతున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచే కాక విదేశాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి ఆశీస్సులు పొందుతారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు లోకకల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మూలరాములకు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న స్వామివారి 353వ సప్తరాత్రోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.



మ్యూజియంలో ఏర్పాటు చేసిన మఠం సమాచారం

రాఘవేంద్ర స్వామి జీవితచరిత్ర

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో ఉండే తమిళనాడులోని భువనగిరిలో తిమ్మనబట్టు, గోపమ్మ అనే దంపతులకు 1,595 సంవత్సరంలో మన్మథనామ సంవత్సరం పాల్గుణ శుద్ధ సప్తమి గురువారం రాఘవేంద్రస్వామి జన్మించారు. ఈయనకు వెంకటనాథుడని మొదటగా పేరు పెట్టారు. ఐదేళ్ల వయస్సులో విద్యాభ్యాసం ప్రారంభించి నాలుగు వేద అధ్యాయాలను చదివి సాటిలేని పాండిత్యాన్ని సంపాదించారు. పరిమళ వాఖ్యానంలో గెలుపొంది పరిమళాచార్యులుగా, 18రోజులుగా జరిగిన గ్రంథ పరిశోధనలో ద్రావిడ సన్యాసిని ఓడించి మహాభాష్యా పండితాచార్యులుగా, ద్వైత్వ సిద్ధాంతాలపై గెలుపొంది బట్టాచార్యులుగా బిరుదులు సంపాదించారు.

సన్యాసం స్వీకరణ

వెంకటనాథుడికి రాత్రి శ్రీరామచంద్ర ప్రభువులు స్వప్నంలో దర్శనమిచ్చి సన్యాసం తీసుకోమని ఆజ్ఞాపించారు. ఇందుకు అంగీకరించిన వెంకటనాథుడు ఒక రోజు రాత్రి భార్య పిల్లలను వదిలి తంజావూర్ రాజు రఘునాథుడి ఆధ్వర్యంలో 1623 సంవత్సరం పాల్గుణ శుద్ధ విదియనాడు మధ్వాపీఠ సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక సన్యాసం స్వీకరించారు. ఈ సన్యాసం తీసుకున్న రోజు నుంచి రాఘవేంద్రతీర్థగా నామకరణం పొందారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం మహోత్సవం మంత్రాలయంలో ప్రతి ఏటా వైభవంగా జరుగుతుంది.

బృందావనంలోకి ప్రవేశం..

1,671 శ్రావణ బహుళ విదియ గురువారం సూర్యోదయానికి ముందు మూల రాముడిని మనసారపూజించి ముందుగా ఏర్పాటు చేసుకున్న సమాధిలోకి సజీవంగా సమాధిపొందారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆగస్టునెలలో ఏడు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తారు. మంత్రాలయం మఠం ప్రధాన కేంద్రంగా దాదాపు వెయ్యికి పైగా బృందావనాలు వెలిశాయి. భారతదేశంలో దాదాపు 24 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా బృందావనాలు వెలిసి అనునిత్యం పూజలు జరుగుతున్నాయి. విదేశాలైన సింగపూర్, మలేషియ, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో సైతం బృందావనాలు వెలిసి నిత్య పూజలు అందుకుంటున్నారు.

భక్తులకు ఏర్పాట్లు: ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకోసం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆదేశాలమేరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. తాగునీరు, వసతి, భోజనం, పరిశుభ్రత, తుంగాస్నానం, ఆసుపత్రి, అంబులెన్సు, క్యూలైన్లు, వీఐపీలకు వసతి, దర్శనం, పరిమళప్రసాదం ప్రత్యేకకౌంటర్లు, వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం, మఠం ముఖద్వారాం, ప్రధాన రహదారులు, వసతిగృహాలను విద్యుత్ దీపాలతో శ్రీమఠం అధికారులు ఏర్పాట్లు చేశారు.
ఏడురోజులపాటు జరిగే ఉత్సవాలకు ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలమేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ సోమన్న, సీఐ రామాంజులు, ఎస్ఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో 300మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రముఖుల కోసం నిర్మించిన పద్మనాభ గెస్ట్ హౌస్

ఉత్సవాలు ఇలా..


18న ధ్వజారోహణం, గోపూజ, ఆశ్వపూజ, ధాన్యపూజ, సంస్థాన పూజలు
19న రజిత మంటపోత్సవం, శాఖోత్సవం
20న పూర్వారాధన,
21న మధ్యారాధన,
22న ఉత్తరాధన, మహా రథోత్సవం
23న సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన
24న సర్వ సమర్పణోత్సవంతో ఉత్సవాలకు ముగింపు



దాత నిర్మించి విరాళంగా ఇచ్చిన గురునివాస్ భవనం

రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు వీరికే...

మైసూర్ మహారాజ్ యదువీర్ కృష్ణ దత్త చామరాజ ఒడియార్, బీజీస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ లార్డ్ ప్రకాష్‌నాథ్ స్వామీజీ, బెంగుళూరుకు చెందిన విద్యావన్ రఘుపతి ఉపాధ్యాయ, వారనాణాసికి చెందిన ప్రొఫెసర్ భూషన్ ఓజాలకు అవార్డులు అందజేయనున్నారు.



భక్తులకోసం నిర్మించిన గెస్టుహౌస్‌ల సముదాయం

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయకండి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము.గర్భిణీలు, బాలింతలు, వికలాంగులు, వృద్ధులకు శీఘ్రదర్శన ఏర్పాట్లు చేశాము. దుర్గ రమణ కల్యాణమండపంలో ఉచితంగా క్లాక్ రూం, లాకర్‌లు ఏర్పాటు చేసి బసచేసే సౌకర్యం కల్పించాం. ఉచిత వైద్యం, అంబులెన్స్ తాగునీరు, పరిమళ ప్రసాదం, క్యూలైన్లు, సర్వం సిద్దం చేశాం.

-సుబుదేంద్ర తీర్థులు, పీఠాధిపతి,
రాఘవేంద్ర స్వామి మఠం, మంత్రాలయం



39 మంది సీఐలు బదిలీ

కర్నూలు ఆగస్టు 17: కర్నూలు రేంజ్ పరిధిలో 39 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 23 మంది కాగా, అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో 16 మంది సీఐలు బదిలీ అయ్యారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శేషయ్య	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కర్నూలు వన్‌టౌన్ (అటాచ్డ్ సీసీఎస్)
జి.నిరంజన్ రెడ్డి	కర్నూలు వన్‌టౌన్ (అడిషినల్ పోస్టు)	వీఆర్, కర్నూలు
జి.శంకర్ మల్లయ్య	ఎస్సీ ఎస్టీ సెల్, అన్నమయ్య	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, కర్నూలు
ఎం.నాగ శేఖర్	ఓర్వకల్లు అవుట్‌పోస్టు, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
ఎం.శ్రీనాథ రెడ్డి	పీసీఆర్ ఆదోని, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సైబర్ సెల్, అన్నమయ్య జిల్లా
కె.జయరాములు	డీసీఆర్‌బీ, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
ఎ.ఓబులేసు	పీసీఆర్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
కుచల శ్రీనివాసులు	వీఆర్, కర్నూలు	సీసీఎస్-1 నంద్యాల
టి.శ్రీధర్	సైబర్ సెల్, చిత్తూరు	సీసీఎస్-1 (క్యాన్సిల్)
జి.నిరంజన్ రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్-2 నంద్యాల
వి.ప్రభాకర్ రెడ్డి	సీసీఎస్-2, నంద్యాల	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల
కె.మోహన్ రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్-3 నంద్యాల
జి.యువరాజు	వీఆర్, అన్నమయ్య	ఎస్సీ, ఎస్టీ సెల్, నంద్యాల
జి.ప్రియతమ్ రెడ్డి	వీఆర్ఎస్‌పీ, నంద్యాల	సైబర్ క్రైమ్, నంద్యాల
ఎ.ఆదినారాయణ రెడ్డి	వీఆర్, కర్నూలు	డీటీసీ, నంద్యాల
పి.సురేష్ కుమార్	సీసీఎస్, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
జె.రమేష్ కుమార్	వీఆర్, నంద్యాల	దిశా-1 నంద్యాల
ఆర్.ఈశ్వరయ్య	వీఆర్, కడప	దిశా ఉమెన్-2 నంద్యాల
కె.ఎరిషావలి,	వీఆర్, కర్నూలు	ఎస్‌బీ-2 నంద్యాల
బీవీ చలపతి	వీఆర్, నంద్యాల	ఎస్‌బీ-3 అన్నమయ్య
పి.శంకరయ్య	వీఆర్, కర్నూలు	ఆర్ఎస్‌టీఎఫ్ అన్నమయ్య (క్యాన్సిల్)
టి.నరసింహులు	వీఆర్, నంద్యాల	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య

పెళ్లింట విషాదం

గోనెగండ్ల, ఆగస్టు 17: పొద్దు పొడిస్తే ఇ ఇంట పెళ్లి. అంతవరకు సంబరంతో అంతా తానై పెళ్లి పనులు చేశాడు. వంట సరుకులు తీసుకువచ్చేందుకు గంజహళ్లి గ్రామం నుంచి గోనెగండ్లకు బైక్‌పై బయలుదేరాడు. ఎల్లెల్సీ మలుపు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గంజహళ్లి గ్రామానికి చెందిన దరగయ్య(35) కూలి పనులు చేసి జీవనం సాగించేవాడు. ఆదివారం మేనళ్లుడి పెళ్లి నిశ్చయించారు. దీంతో దరగయ్య సరుకులు తీసుకు వచ్చేందుకు శనివారం బైక్‌పై గోనెగండ్లకు బయలు దేరాడు. గోనెగండ్ల సమీపంలోని ఎల్లెల్సీ దగ్గర రాగానే గోనెగండ్లకు చెందిన జీనియస్ గ్లోబుల్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో దరగయ్య రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ కందనాతి షేక్ మాబువలి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న దరగయ్య కుటుంబ సభ్యులు, పెళ్లికి వచ్చిన బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీమున్నీరయ్యారు. దరగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భార్య బాలక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 17: కర్నూలు జిల్లా స్పోర్ట్స్ సెలక్షన్స్ స్కూల్ అవార్డుకు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా ప్రధానోపాధ్యాయులకు, వ్యాయామ ఉపాధ్యా యులకు జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఫైవ్‌మెన్ కమిటీ పరిశీలించిన తర్వాత అత్యధిక స్కోరు వచ్చిన పాఠశాల వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

లారీ, ట్రావెల్ బస్సు ఢీ..

● బస్సు డ్రైవర్ మృతి ● లారీ డ్రైవర్లకు స్వల్ప గాయాలు

డోన్(రూరల్), ఆగస్టు 17: లారీ, ట్రావెల్ బస్సు ఢీకొని బస్సు డ్రైవర్ మృతి చెందాడు. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డోన్ పట్టణం సమీపంలోని మ్యాక్స్ ఫోర్ హోటల్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పట్టణ పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి ఖమ్మం వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్ బస్సు డోన్ హైవే మీదుగా వస్తూ డివైడర్‌ను దాటుకుని హైదరాబాదు నుంచి సేలంకు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సతీష్ కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో ఉన్న డ్రైవర్లు ముత్తుస్వామి, చిన్న స్వాములకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రావెల్ బస్సులో 22 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు, లారీల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. లారీలో ఇరుక్కున్న డ్రైవర్లను పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసులు క్రేన్ సహాయంతో బయటకు తీసి వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా క్రేన్ సాయంతో లారీ, బస్సులను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆరెంజ్ బస్సు డ్రైవర్ సతీష్ కుమార్ తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా నందమర్రి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన లారీ



దెబ్బతిన్న ట్రావెల్ బస్సు ముందు భాగం

పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

నంద్యాల టౌన్, ఆగస్టు 17: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్‌లో రైతులు పంటలను సాగు చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ అన్నారు. శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ, ఆర్ఏఆర్ఎస్ సంయుక్త నిర్వహణలో శిక్షణ, సందర్శన (టీ అండ్ వీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో శనగ సాగు చేసే రైతులు కొర్ర, మినుము, సోయాబీన్ లాంటి పంటలు కూడా పండించి అధిక దిగుబడులు, అధిక ఆదాయం పెంచుకోవచ్చన్నారు. రైతులు శనగ పంటకు ముందు ఎలాంటి పంటలు విత్తని పక్షంలో భూమిలో ఉష్ణోగ్రత్త పెరగడం, నేలలో తేమ శాతం తగ్గడం జరుగుతాయన్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పంటలు పండించే సమయంలో భూముల సాంద్రతను బట్టి ఏ పంటలు అనుకూలమో ఆ పంటలను సాగు చేయాలని సూచించారు. కర్నూలు జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగు, వాతావరణ పరిస్థితుల ప్రభావం తదితర అంశాలను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు మాట్లాడుతూ వివిధ పంటల్లో తెగుళ్ళ నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, పత్తిలో గులాబీ రంగు పురుగుల నివారణ చర్యలను వివరించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ నీలిమ, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ఏఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న పోరాటాలు అభినందనీయమని, జర్నలిస్టులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హామీ ఇచ్చారు. శనివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ వార్షికోత్సవం పురస్కరించుకుని నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బయ్య ఆవిష్కరించగా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిల్లల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం శరణాలయం పిల్లలకు ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మీడియాకు మంచి ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఉంటూ సమాజంలో వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. అలాగే జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషి కూడా అభినందనీయమని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాకు స్నేహితుడని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం ఆయనతోనే సాధ్యమన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ నాయకులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ సలహాదారు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, కే శ్రీనివాసగౌడ్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, సీనియర్ నాయకులు హుస్సేన్, మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివరాజ్‌కుమార్, వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, నాయకులు ఎం. శ్రీనివాసరాజు, నాగప్రసాద్, మురళి, వీడియో జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్నేహల్, ఎల్లాగౌడ్, శేఖర్, నాగేశ్, సురేశ్, గంగాధర్, రఫీ, కీర్తన అనాథ శరణాలయం నిర్వాహకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

ఆదోని రూరల్, ఆగస్టు 17 : ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ బోయ వెంకటేశులు(27) మృతి చెందాడు. ఆదోని మండలం బైచిగేరికి చెందిన బోయ వెంకటేశులు ఆదోనిలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. శనివారం పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని లారీ బైచిగేరి సమీపంలో ఢీకొంది. దీంతో వెంకటేశులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేశామని తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్యను ఇస్సీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక మద్యం తరలిస్తుండగా అదుపులో తీసుకున్నారు.

అన్న క్యాంటీన్ పనులు వేగవంతం చేయండి



అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఆగస్టు 17: పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం 37వ వార్డు పరిమలనగర్‌లోని అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. అనంతరం వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ముజఫర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, గత రెండు రోజులుగా వైద్యులు సెలవులో ఉండటంపై ఎమ్మెల్యే గౌరు చరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా అన్న క్యాంటీన్లలో సౌకర్యాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ వార్డుల అధ్యక్షుడు పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ మాదన్న పాల్గొన్నారు.

కమీషన్ల మేయర్ రాజీనామా చేయాలి

టీడీపీ కార్పొరేటర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ కార్పొరేటర్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 17: నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య కమీషన్ల కోసం ఎలాంటి పనైనా చేస్తున్నారని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని 8వ వార్డు కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ కురవ పరమేష్ డిమాండ్ చేశారు. కార్మికుల నియామకాల విషయంలో సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్‌లపై మేయర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీడీపీ కార్పొరేటర్లు శనివారం నగర పాలక కార్యాలయం ఎదుట సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం, మంత్రిపై వ్యాఖ్యలు చేసే నైతిక విలువలు రామయ్యకు లేవని అన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరమేష్ మాట్లాడారు. పార్టీలకు అతీతంగా కార్మికులను తీసుకున్నామని, గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన వారిని మాత్రమే విధుల్లోకి తీసుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. అనంతరం కమిషనర్ పీవీ. రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. 14వ వార్డు కార్పొరేటర్ జకియా అక్సారి మాట్లాడుతూ తన వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రతి సమావేశంలో లేవనెత్తిన కూడా మేయర్ అస్సలు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. మాజీ కార్పొరేటర్ పెరుగు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్‌పై మాట్లాడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో 2వ వార్డు కార్పొరేటర్ అబ్దుల్ లతీఫ్, రామాంజనేయులు, జీఎల్‌వీ శేషయాదవ్, గున్నామార్క్, ఖాదర్ బాషా, మోయిన్‌బాషా, మణినాయుడు, విక్రమసింహ పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన

రిటైర్డ్ ఏపీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 17: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రిటైర్డ్ ఏపీ చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం కర్నూలు ఐఐఐటీడీఎం ప్రాంగణంలోని కృష్ణా సెమినార్ హాల్లో ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎల్వీ సుబ్రహ్మణ్యం హాజరై ప్రసంగించారు. విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజు దినపత్రికలు చదివినట్లయితే దేశంలో ఏం జరుగుతుందో తెలుస్తుందని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే నూతన ఆవిష్కరణలు కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు అధ్యాపకులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలతో సతమతమవుతూ ఆత్మహత్య చేసుకునే స్థాయికి విద్యార్థులు చేరుకోవడం దురదృష్టకరమన్నారు. అధ్యాపకులు నిరంతరం విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం కలకత్తా మెడికల్ విద్యార్థిని ఆత్మహత్యకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛ కేసీ కెనాల్, స్వచ్ఛ హంద్రీ అనే నినాదంతో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎన్జీయూ భవన్‌లో జరిగే ఈ సమావేశంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు.

నిబద్ధతతో పని చేయాలి: డీటీఎఫ్



మాట్లాడుతున్న వెంకట్రాముడు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 17: ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పని చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు అన్నారు. శనివారం డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు బజారప్ప, స్కూల్ అసిస్టెంట్ వెంకట్రాముడులను డీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని సర్దుబాటుతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, జీవో. 53 ప్రకారం రేషనలైజేషన్ జరపాలని, విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:40గా ఉండాలని కోరారు. పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. డీటీఎఫ్ నాయకుడు గట్టు తిమ్మప్ప, పత్రికా సంపాదకులు రత్నం ఏసేపు, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామన్న, ఈశ్వర్, గోపాల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నేడు మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 17: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సి.మురళీమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సమీపంలోని నయనాలప్ప క్షేత్రంలో జరగబోయే ఎన్నికలకు పసుపల పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అధ్యక్షుడు, అసోసియేట్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు (4), జేసీసీ సభ్యుడు-1 సంబంధించి ఎన్నికలు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతాయన్నారు.

ఏసీపీ రంగస్వామికి మెమో

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 17: నగర పాలక సంస్థలో డిప్యుటేషన్ ప్రాతిపదికన పనిచేస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామికి టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి మెమో జారీ చేశారు. 2013లో నంద్యాల మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సమయంలో రంగస్వామి టీడీఆర్ బాండ్ల జారీ విషయంలో తప్పిదాలు జరిగినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు తప్పిదాల గురించి వివరణ ఇవ్వాలని మెమో జారీ చేశారు.

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు

సి.బెళగల్, ఆగస్టు 17: మండలంలోని కె శింగవరం 1, కంబదహల్ 2 గ్రామాల్లోని పాఠశాలలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ముగిశాయి. ఈసందర్భంగా మండల విద్యాధికారి ఆదాంబాషా మాట్లాడుతూ ఈ పాఠశాలలో స్కూల్ కమిటీ చైర్మన్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవం ఎన్నుకున్నారన్నారు.

ఎంపీడీవో సేవలు మరువరానివి

ఓర్వకల్లు, ఆగస్టు 17: ఓర్వకల్లు ఎంపీడీవో మల్లేశ్వరి సేవలు మరువరానివని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కొనియాడారు. శనివారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై కడప వెళ్తున్న మల్లేశ్వరికి ఎంపీడీవో శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ జరిగింది. ఈసందర్భంగా మల్లేశ్వరిని పూలమాలలు, దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఈలు రామ సుబ్బారెడ్డి, మురళి, రామయ్య, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఏపీవో కుమార సాయినాథ్, సర్పంచులు రామచంద్రుడు, బ్రహ్మయ్య, పెద్ద కాశీం, గంగాధర్ రెడ్డి, మధుకేశన్న, నాయకులు అబ్దుల్లా, శోభన్‌బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

జనసైనికుల సంబరాలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 17: కొరియో గ్రాఫర్, జనసేన సానుభూతిపరుడు జానీ మాస్టర్‌కు జాతీయ ఉత్తమ కొరియో గ్రాఫర్‌గా అవార్డు దక్కడం పట్ల జనసేన వర్గాలు సంబరాలు జరుపుకున్నారు. శనివారం జనసేన పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి షేక్ అర్షద్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వీరమహిళలు, బ్రాహ్మణి, దేవి, కనకదుర్గ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

గూడూరు, ఆగస్టు 17: గూడూరులో వెలసిన తిమ్మగురుడు స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ అశేష భక్తజనుల మధ్య వైభవంగా సాగింది. శనివారం ఉదయం తిమ్మగురుడు స్వామికి కలశ, గంగ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. అలాగే పల్లకిసేవ, నందికోల సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఓర్వకల్లు, ఆగస్టు 17: మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన ఆదినారాయణ శనివారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

సి.బెళగల్, ఆగస్టు 17: సి.బెళగల్ పోలీసు స్టేషన్‌ను కోడుమూరు సీఐ తబ్రేజ్ తనిఖీ చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల గురించి ఎస్ఐ తిమ్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే తమను సంప్రదించాలన్నారు. సీఐ వెంట ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 17: హెచ్ఐవీ, ఎయిడ్స్ లాంటి సుఖవ్యాధులపై అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణ మండలి డైరెక్టర్ ఆదేశాల మేరకు విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాలకు బానిసలవకుండా భవిష్యత్తు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఏవిధంగా వస్తుంది అనే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ మేనేజర్ ప్రసాద్, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్.కొంతలపాడులో ఆంజనేయస్వామి ఉత్సవాలు



గ్రామోత్సవంలో చిన్నారుల కోలాటం

కర్నూలు రూరల్, ఆగస్టు 17: మండలంలోని ఆర్.కొంతలపాడులో శనివారం ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ కురువ మహానంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతియేటా శ్రావణమాసంలో వచ్చే రెండో శనివారం రోజున ఈ ఉత్సవాన్ని గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చి ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆంజనేయస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామోత్సవం ఎదుట చిన్నారుల నృత్య ప్రదర్శన, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు కర్నూలు నగరం నుంచి కూడా భారీగా తరలివచ్చారు.

హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా, నగరంలోని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాజ్‌విహార్ సర్కిల్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించిన బంగ్లాదేశ్‌లో మృతి చెందిన హిందువుల కుటుంబాలకు నివాళులు అర్పించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో హిందూ చైతన్యవేదిక నాయకులు నరేష్, మామిళ్లపల్లి రాజేశ్, మాధవప్రభు, ఆర్ఎస్ఎస్ నాయకుడు డాక్టర్ డి. వాసురెడ్డి, వీహెచ్‌పీ జిల్లాల అధ్యక్షుడు టీజీ మద్దిలేటి, రాష్ట్ర నాయకులు గోరంట్ల రమణ, శ్రీనివాసరెడ్డి, జీఎస్ విశాలాక్షి, ఉమ, మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి, దేవిక పాల్గొన్నారు.

వేదికలు వ్యక్తిత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 17: కళాశాలల్లో జరిగే వేదికలు విద్యార్థుల వ్యక్తిత్వ నైపుణ్యాలు పెంపొందిస్తాయని కళాశాల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో టెడెక్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ వక్తలు చేసిన ప్రసంగాలు, విద్యార్థులను ఆలోచింపజేస్తాయన్నారు. వైస్ చైర్మన్ వంశీ ధర్, గోపినాథ్, ప్రొ.జి.శశికుమార్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సి.బెళగల్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ బలరాముడు, వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సతీష్, రవి, దాసు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కర్నూలు ఆగస్టు 17: బళ్లారి చౌరస్తా వద్ద ఓ వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కల్లూరు ప్రాంతానికి చెందిన అబ్దుల్ రెహిమాన్ (60) బళ్లారి చౌరస్తా వైపు నుంచి కల్లూరు వైపు వెళ్తుండగా.. వెనుక నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

గొలుసు దొంగ అరెస్టు

8 కేసుల్లో రికవరీ

కర్నూలు ఆగస్టు 17: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు వీరేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 21 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. దేవనకొండ మండలం తెర్నేకల్లుకు చెందిన వీరేష్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. ఒంటరిగా వెళ్తున్న మహిళలనే లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. ఇటీవల జరిగిన ఓ చైన్ స్నాచింగ్‌లో పోలీసులు నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి 21 తులాల బంగారు నగలు, నెంబర్ ప్లేట్ లేని మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు త్రీటౌన్ పోలీస్‌స్టేసన్ పరిధిలో 7 కేసులు, నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక స్నాచింగ్ చేసినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం

లద్దగిరిలో మళ్లీ వాయిదా



చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 17: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 8న జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు పలు పాఠశాలల్లో వివిధ కారణాలచే వాయిదా పడ్డాయి. ఆయా పాఠశాలల్లో తిరిగి శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పులకుర్తి జడ్పీ, అమడగుంట్ల ఉన్నత, ఎస్సీ స్పెషల్, మెయిన్ స్కూళ్లకు టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లద్దగిరి ఉన్నత పాఠశాలలో ఎన్నిక మళ్లీ వాయిదా పడింది.

కేజీబీవీలో రసవత్తర పోటీ: కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో ఎస్‌ఎంసీ ఎన్నికకు రసవత్తర పోటీ జరిగింది. ఇక్కడ టీడీపీ, వైసీపీ మద్దతుదారులు తలబడ్డారు. అధికారులు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. టీడీపీ మద్దతు అభ్యర్థులు 64 ఓట్లు సాధించగా, వైసీపీ మద్దతుదారులకు 43 ఓట్లు లభించాయి. దీంతో టీడీపీ మద్దతుదారులు 21 ఓట్ల మెజార్టీ పొందారు. కేజీబీవీ చైర్మన్ తోటమ్మ, వైస్ చైర్మన్‌గా నాగరాజులను ఎన్నుకున్నారు. ఎస్‌ఎంసీ కమిటీని టీడీపీ, జనసేన నాయకులు జె.రాముడు, మద్దూరు హనుమంతు, చెన్నరాయుడు, అశోక్, జీపు క్రిష్ణ, రామాంజనేయులు, గడ్డమయ్య, రామచంద్రుడు, నాగరాజు, ప్రకాష్, మారెప్ప, గిరి, రాకేష్, లక్ష్మన్న అభినందించారు.

సేవా రంగంలో లయన్స్ క్లబ్‌దే ప్రథమ స్థానం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: సామాజిక సేవా రంగంలో ప్రపంచ దేశాల్లోనే లయన్స్ క్లబ్‌ది ప్రథమ స్థానమని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ దుర్గా నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని కేఎస్ఆర్ పాఠశాల ఆవరణలో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ బాలమద్దయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు లయన్స్ క్లబ్ సేవలు విస్తరించి, నిరుపేదలకు అండగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. లయన్స్ క్లబ్ అడ్మినిస్టేటర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మెల్విన్ జోన్స్ నూతన అధ్యక్షుడుగా పీసీ పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి. గోపీనాథ్, ఉపాధ్యక్షులుగా తెలుగు అశోక్‌కుమార్, బీవీఎల్ నరసింహారావు, డాక్టర్ వి.రమేష్, గౌరవాధ్యక్షులుగా కే మహేంద్ర, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా మంజులరాణి, మెంబర్‌షిప్ చైర్మన్‌గా రాయపాటి నాగలక్ష్మిలు ఎన్నికయ్యారు.

నేడు గణేశ్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో సమావేశం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: నగరంలోని గణేశ్ ఉత్సవ సమితుల ప్రతినిధులతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని కేసీ కెనాల్ వినాయక మందిరంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జోగయ్యశర్మ, జిల్లా సంఘటనా కార్యదర్శి డాక్టర్ ఎం. నాగఫణిశాస్త్రి, నగర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, జంపాల జనార్దన్ హాజరుకానున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లాలో సెప్టెంబరు 7న ప్రారంభమవుతాయని అన్నారు. కర్నూలు నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం సెప్టెబరు 15న ఉంటుందని, ఈ నేపథ్యంలో నగరంలోని గణేశ్ (మంటపాల) ఉత్సవ సమితుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్చిస్తామని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 17: ఆదోని మార్కెట్ యార్డులో వేరుశనగ నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శనివారం జేడీ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆదోని మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు వర్షానికి దెబ్బతినకుండా ఉండేందుకు తార్పాలిన్లు అందుబాటులో ఉంచకుండా మార్కెట్ యార్డు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపడం దారుణమన్నారు. యార్డు అధికారులు సెస్సు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇష్టారాజ్యంగా అనవసరమైన పనులకు ఖర్చు చేయడం తప్పితే.. రైతులకు ప్రయోజనం చేకూర్చే అత్యవసర పనులకు ఖర్చు పెట్టడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో గొందిపర్ల మాజీ సర్పంచ్ ఆంజనేయులు, శివన్న, మద్దిలేటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

సి.బెళగల్, ఆగస్టు 17: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని మండల విద్యాధికారి ఆదాంబాషా అన్నారు. శనివారం మండలంలోని పోలకల్లు, సిబెళగల్ పాఠశాలల సముదాయం కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో బాలికలు అధికంగా సీడు పత్తి క్రాసింగ్ చేయడానికి వెళ్తున్నారని అన్నారు. అలాంటి వారంతా బడులకు వచ్చేలా చూడాలని సూచించారు.

సౌకర్యాలే లక్ష్యంగా పని చేద్దాం

అధ్యాపకులు, ఆచార్యులతో సమీక్షించిన వీసీ

కర్నూలు(అర్బన్), ఆగస్టు 17: యూనివర్సిటీలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేద్దామని ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలోని కాన్ఫరెన్స్ హాలులో బోధన, బోధనేతర, అధ్యాపక, ప్రొఫెసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల దృష్టికి తాగు నీటి సమస్యను తీసుకెళ్లగా వెంటనే పరిష్కారానికి చొరవ చూపారని అన్నారు. బాలురు, బాలికల వసతి గృహాల్లో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు అందరు సహకరించాలని కోరారు. వర్సిటీలో ప్లేగ్రౌండ్, జిమ్ సెంటర్, లైబ్రరీని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు, చీఫ్ వార్డెన్ సీవిశ్వనాథరెడ్డి, వార్డెన్ వై.హరిప్రసాదరెడ్డి, డిప్యూటీ వార్డెన్లు, స్టీవార్డెన్లు, పాల్గొన్నారు.

టీబీ డ్యామ్ స్టాప్‌లాగ్ విజయవంతంపై హర్షం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 17: హొస్పేట్‌లోని తుంగభద్ర డ్యామ్‌లో వరద ఉధృతికి కొట్టుకు పోయిన 19వ గేట్ స్థానంలో స్టాప్ లాగ్‌ని విజయవంతంగా అమర్చడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. స్టాప్ లాగ్ ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేసిన టీబీ బోర్డు అధికారులు, ఇంజనీరు నిపుణుడు కన్నయ్య నాయుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తుంగభద్ర డ్యామ్ చరిత్రలో ఇదోక అద్భుతమన్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్ణాటక ప్రభుత్వం సహకారంతోనే ఇది పూర్తయిందన్నారు. డ్యామ్‌లో 70 టీఎంసీల నీరు ఉన్నప్పుడే గేటును ఏర్పాటు చేయడంతో 30 టీఎంసీల నీరు సముద్రం పాలు కాకుండా కాపాడుకోగలిగామని తెలిపారు. గేటు కొట్టుకు పోయిన సమయంలో సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అమోఘమైనదని, విజయవంతంగా స్టాప్ లాగ్ ఏర్పాటు చేయడంతో ఆయన కృషి ఫలించిందన్నారు.

ఐదేళ్ల విజన్ ప్రణాళికపై అధికారులకు శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 17: కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఐదేళ్ల విజన్ ప్లాన్‌పై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో రెండో రోజు 20 శాఖల అధికారులు, మొదటి రోజు 25 శాఖల అధికారులు, వర్క్‌షాపులో పాల్గొన్నారు. సీపీవో హిమ ప్రభాకర్ రాజు మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లా అభివృద్ధి చెందేవిధంగా ప్రణాళికను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కోడుమూరు(రూరల్), ఆగస్టు 17: మండలంలోని ప్యాలకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బయోజెమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు సంస్థ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. టెరిటరీ మేనేజర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం పౌరోహితం మారుతి, చైర్మన్ షేక్షావలి, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యపై నిరసన



ఓర్వకల్లు సీహెచ్‌సీలో నిరసన తెలుపుతున్న వైద్యులు



పెంచికలపాడులో..


గూడూరు, ఆగస్టు 17: కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యకు పెంచికలపాడు విశ్వభారతి వైద్యకళాశాల ఆచార్యులు, వైద్య విద్యార్థులు నిరసన తెలిపారు. శనివారం గూడూరు మండలం లోని పెంచికలపాడు దగ్గర విశ్వభారతి వైద్యకళాశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.మునీరుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ వైద్యురాలి మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వైద్య బృందం పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఓర్వకల్లు: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మంజుల డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, జూనియర్ డాక్టర్లు ఆసుపత్రి నుంచి బస్టాండు వరకు ర్యాలీగా వెళ్లి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా నిరసన తెలిపారు. వైద్యుల నిరసనకు విద్యార్థి సంఘాల నాయకులు రవీంద్ర, అయ్యన్న, విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలకు రక్షణ కరువైందన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు దాదాబాషా, రాజేశ్వరి, యోగేశ్వరి, అశ్విన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డెంటల్ హాస్పిటల్స్ బంద్

వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనపై నిరసన



గాంధీ నగర్‌లో నిరసన తెలుపుతున్న డెంటల్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 17: కోల్‌కత్తాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచార కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం డెంటల్ వైద్యులు వైద్యసేవలు నిలిపివేశారు. జిల్లాలోని ప్రైవేటు డెంటల్ హాస్పిటల్‌లో అత్యవసర సేవలు మినహా అన్ని చికిత్సలు పూర్తి స్థాయిలో నిలిపివేసినట్లు రాయలసీమ డెంటల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని గాంధీనగర్ నుంచి రాజ్‌విహార్ వరకు డెంటల్ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 17: మండలంలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న కురువ పార్వతి మృతి పట్ల వారి కుటుంబానికి న్యాయం జరగకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, కార్యదర్శి షాబీర్‌బాషా అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహయ కార్యదర్శి థోమస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రాలయం నియోజకవర్గంలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు బంద్‌కు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. వారు మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మ హత్య జరిగి 12 రోజులు కావస్తున్నా ఇంతవరకు కారణాలు తెలపలేదని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడం, పోలీసు శాఖ వారిని వెనుకేసుకుని రావడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాచేసి బైటాయించి డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, వీరేష్, దివాకర్, మైకేల్, రాము, వీరేష్ గోవిందు పాల్గొన్నారు.

కోసిగి: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్ హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్న పార్వతి విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న, ఏఐవైఎఫ్ తాలుకా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అనంతరం మృతి చెందిన విద్యార్థిని పార్వతి కుటుంబానికి న్యాయం చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, దివాకర్, నబీ, వీరేంద్ర, మల్లికార్జున, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలు సాగు చేసుకోండి

మద్దికెర, ఆగస్టు 17: మండలంలోని వ్యవసాయ తోటల్లో రైతులు పండ్ల తోటలను సాగు చేసుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. శనివారం పెరవలి గ్రామంలో పండ్ల తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులను గుర్తిస్తున్నామన్నారు. ఐదెకరాల కంటే తక్కువ భూములు ఉన్న వారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకాలు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, ఆగస్టు 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి గద్వాల కు చెందిన కళ్యాణి కిషన్‌రావు అనే భక్తురాలు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

మోనూ ప్రకారం భోజనం అందించాలి

దేవనకొండ, ఆగస్టు 17 : పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మోను ప్రకారం అందించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు శరత్ అన్నారు. మండలంలోని తెర్నేకల్ జెడ్పీ పాఠశాలలో శనివారం ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏజెన్సీ బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు రంగన్న, భాస్కర్, మధు, ఉమేష్, అరవింద్ ,మహేష్ ఉన్నారు.

రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

మద్దికెర, ఆగస్టు 17: మండలంలో పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి పూజలు వైభవంగా జరిగాయి. శనివారం మూలవిరాట్ రంగనాథ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు రంగనాథ స్వామి ప్రత్యేక పూజలు చేయించారు. శ్రావణమాసం రెండో శనివారం కావడంతో పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులైన శ్రీరంగనాథ స్వామి, భూదేవి శ్రీదేవి ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపు చేశారు. రంగనాథ స్వామి, భూదేవి శ్రీదేవి, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, ఆగస్టు 17: విద్యా కమిటీ ఛైర్మన్లుగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో రమావెంకటేశ్‌గౌడు, జొన్నగిరి ఎస్ఐ చంద్ర అన్నారు. శనివారం ముక్కెల్ల, పెండెకల్‌లోని వాయిదా పడ్డ ఎస్ఎంసీ ఛైర్మన్ ఎన్నికలను నిర్వహించారు. ముక్కెలలో టీడీపీ సానుభూతిపరుడు ఛైర్మన్ ఎస్.మల్లికార్జున, వైస్ ఛైర్మన్‌గా సరస్వతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పెండేకల్ ఎస్సీ కాలనీ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి ఛైర్మన్‌గా గౌరమ్మ శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ సుచరితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, టీడీపీ నాయకులు రామచంద్ర, మునెప్ప, బాలు, చిరంజీవి, చంటి ఉన్నారు.


బాధితులకు అండగా ఉందాం

ఆలూరు రూరల్, ఆగస్టు 17: కేరళలోని వయనాడ్ వరదలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉందామని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఆలూరు మండలం అగ్రహారం గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీలు ద్వారా విరాళాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు శేఖర్, కృష్ణ, విఠల్, నారాయణ పాల్గొన్నారు.

జీనియస్ గ్లోబుల్ స్కూల్‌ను సీజ్ చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 17: ఫిట్‌నెస్ లేని బస్సులు, టాటాఏసీ, టాటా సుమోల్లో విద్యార్థులను తరలిస్తున్న జీనియస్ గ్లోబుల్ స్కూల్‌ను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. స్కూల్లోకి వెళ్లి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మునిస్వామి, ఏబీవీపీ భరత్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎర్రిస్వామి, బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం మద్దిలేటి, శేఖర్, ఎస్ఎస్‌యూఐ వీరేష్‌యాదవ్, సరసన్న, పీడీఎస్‌యూ మహేంద్రబాబు, రాజేష్, యూఎస్ఎఫ్ఐ ఉదయ్, ఏపీఎస్ఎఫ్ ఉసేన్, డీఎస్‌వైఎఫ్ వెంకటేష్, వైఎస్ఆర్ఎస్‌యూ సోమశేఖర్, షరీఫ్, నాగరాజు, రవితేజ, రాముడు, జుబేరు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం



మంత్రాలయం, ఆగస్టు 17: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాల్లో జరిగే మొదటి రోజు ఆదివారం జరిగే పూజా కార్యక్రమాలు.

- తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మాల విసర్జనం
- అనంతరం 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం
- ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, పంచామృతాభిషేకం
- ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ
- 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహామంగళహారతి, తీర్థప్రసాదాలు
- సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం
- అనంతరం సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ, అశ్వ, గోపూజ, లక్ష్మిపూజలు, కార్యాలయాలకు శాంతిపూజలు
- రాత్రి 8.30 గంటలకు రథోత్సవాలు, ధాన్య పూజలు, ఊంజల సేవ

నిందితులను శిక్షించాలి

జిల్లా వ్యాప్తంగా వైద్యుల ఆందోళన



ఆదోని ప్రభుత్వ అస్పత్రి ముందు నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



మంత్రాలయంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది


పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


తుగ్గలిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది


కోసిగిలో..


హొళగుందలో నిరసనలు తెలుపుతున్న వైద్యులు

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నగరంలో గల ఆర్‌జీకర్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న వైద్యురాలిని దారుణంగా అత్యాచారం చేసి హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా వైద్యులు తలపెట్టిన నిరసనలకు శనివారం జిల్లాలో వైద్యులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలిని హతమార్చిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిధులను కఠినంగా శిక్షించాలని, అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్.



దేవనకొండలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వైద్యులు


ఆలూరులో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


గోనెగండ్లలో నిరసన తెలుపుతున్న ఆసుపత్రి సిబ్బంది


మద్దికెరలో ర్యాలీ



ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్న వైద్యులు


క్రిష్ణగిరిలో...

అభివృద్ధి చేసి చూపించాలి

- ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్


మాట్లాడుతున్న రమేష్ యాదవ్

ఆదోని రూరల్, ఆగస్టు 17 : మార్పు అంటే గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులను బీజేపీలో చేర్చుకోవడం కాదని, ఆదోనిని అభివృద్ధి చేసి చూపించాలని ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ రమేష్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పార్థసారథి తనను గెలిపిస్తే మార్పు చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చి గెలిచిన తరువాత వైసీపీలో అవినీతి అక్రమాలకు పాల్పడిన నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నానని, మార్పు అంటే ఇదేనా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రకృతి సంపద అయిన గరుసు, ఇసుకను కూటమి నాయకులు యధేచ్ఛగా దోచుకుంటున్నారని, మీనాక్షినాయుడు, పార్థసారధి మధ్య రహస్య ఒప్పందాలు బెడిచి కొట్టడంతో, పంపకాల్లో తేడా రావడంతోనే కూటమిలో నిరంతరం కొట్లాట జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఆదోని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చేబుతారని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దీలిప్ డోకా, కాంగ్రెస్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతు రావు, సాయినాథ్, రామన్న యాదవ్, శ్రీనిత్, హనుమంతు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం


రైతులతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 17: ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసిపోయిన వేరుశనగ రైతులకు న్యాయం చేస్తామని ఏపీ ఫుడ్ కమీషన్ మాజీ సభ్యురాలు, తెదేపా రాష్ట్ర నాయకురాలు, మాజీ రాష్ట్ర సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ అన్నారు. శనివారం ఆమె మార్కెట్ యార్డ్‌లో వర్షానికి నష్టపోయిన వేరుశనగ రైతులను పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చేతికొచ్చిన పంట మార్కెట్ విక్రయానికి వస్తే ప్లాట్ ఫాంపై ఉంచిత వేరుశనగ రాశులు వర్షం దాటికి వేరుశనగ దిగుబడులు కొట్టుకోవడం వల్ల నష్టం జరగడం బాధాకరమన్నారు. ప్లాట్ ఫాం ఎత్తును పెంచి డ్రైనేజీలను నిర్మించాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డికి సూచించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారమందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం, ఆగస్టు 17: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ అమరేశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ ఏఈ నరసన్న విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బంటకుంట, నదిచాగి గ్రామ ప్రజాప్రతినిధులు గోపాల్‌రెడ్డి, లింగనగౌడ్ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. పనితీరు మార్చుకోకపోతే ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలని ఎమ్మెల్యే విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ అధికారులు పార్టీలకతీతంగా పనులు చేయాలని అలా కాకుండా విధులు పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. గ్రామాల్లో పని చేస్తున్న వీటీకేలను ఎందుకు మారుస్తారని ఏపీఎం రాజశేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లను, డీలర్లు అధికార పార్టీ నాయకుల మాటలు విని తొలగిస్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు.

వైభవంగా జిహేశ్వర జయంతోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 17: స్వకుల సాలె సమాజ్ ఆరాధ్యులు భగవాన్ జిహేశ్వర స్వాముల జయంతోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబాభవాని దేవాలయంలో భగవాన్ జిహేశ్వర స్వాములవారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం రథోత్సవంలో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు గణేష్ నాగరాజు, సపారే నాగరాజు, జిందే లక్ష్మణ్, గంగన్న మారుతి రావు, పంపాపతి పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

ఆలూరు, ఆగస్టు 17: ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్న ఆలూరులో మాత్రం అమలుకు నోచుకోవడం లేదని.. ఇసుక రవాణాకు సడలింపు ఇవ్వాలని క్లాజ్ 1 కాంట్రాక్టర్ వైకుంఠం ఆనంద్ కుమార్ చౌదరి శనివారం తెలిపారు.. అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకున్నా ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వ భవనాలు నిర్మించుకునేందుకు ఇసుకను తెచ్చుకుంటున్న పోలీసులు, సెబ్ అధికారులు పట్టుకోవడం వల్ల ట్రాక్టర్ నిర్వాహకులు ఎవ్వరూ ఇసుకను తెచ్చేందుకు ముందుకు రాకపోవడంతో నిర్మాణం పనులు నిలిచిపోతున్నాయన్నారు. పోలీసుల చర్యలు వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు.. విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆసుపత్రిని అభివృద్ధి చేస్తాం

పత్తికొండ, ఆగష్టు, 17: పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని డెవలప్‌మెంట్ నూతన కమిటీ సభ్యులు సాంబశివారెడ్డి, సురేష్‌కుమార్, బత్తిన లోక్‌నాథ్ అన్నారు. శనివారం డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కోసం, 30 పడకల హాస్పిటల్‌కు సంబంధించిన సదుపాయాల కోసం అనునిత్యం ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు అందుబాటులో ఉంటారన్నారు. ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఆది నగేష్, హారిక, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

క్రిష్ణగిరి, ఆగస్టు 17: పెద్దొడ్డి గ్రామానికి చెందిన మొండెం రామక్రిష్ణ (54) విద్యుదాఘాతంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రామక్రిష్ణకు ఉన్న రేకుల కొట్టానికి కరెంట్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిడి భార్య మొండెం రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజా వలి తెలపారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

ట్రాక్టర్ తిరగబడి యువకుడు...

దేవనకొండ: ట్రాక్టర్ తిరగబడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పి. కోటకొండ - బేతపల్లి రహదారిపై శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన అల్లిగేరి మల్లికార్జున (28) బేతపల్లి నుంచి ఈదుల దేవరబండ వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా అదుపు బోల్తా తప్పింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

వేదవతికి పోటెత్తిన వరద నీరు



హొళగుంద, ఆగస్టు 17: మండలంలోని మర్లమడికి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వేదవతి నదికి వరద నీరు పోటెత్తింది. కర్ణాటకలోని ఎగువ ప్రాం తాల్లో కురుస్తున్న వర్షాలకు వేదవతి నదికి వరద నీరు భారీగా చేరుతోంది. నది పరివాహక ప్రాంతాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

హొళగుంద, ఆగస్టు 17: మండలంలోని ముద్దటామాగి, వందవాగిలి గ్రామంలోని ఒకటి, రెండవ పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలను) ఎన్నుకున్నట్లు ఎంఈవోలు సత్యనారాయణ, జగన్నాధం శనివారం తెలిపారు. ముద్దటామాగి ఎంపీయుపీ పాఠశాల ఛైర్మన్‌గా టీ.దేవేంద్రప్ప, వైస్ ఛైర్మన్‌గా హెచ్ రంగమ్మ, వందవాగిలి ఎంపీయూపీ పాఠశాలకు ఛైర్మన్‌గా జీ మారెమ్మ, వైస్ ఛైర్మన్‌గా డీ లింగన్న, రెండవ పాఠశాల ఎంపీయుపీ (ఎస్సీ) ఛైర్మన్‌గా జీ మల్లప్ప, వైస్ ఛైర్మన్‌గా డీ పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముద్దటామాగి తిమ్మారెడ్డి, గోవింద్ రెడి పాల్గొన్నారు.

వెంకటాపురం విద్యా కమిటీ ఎన్నిక వాయిదా

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 17: ఎమ్మిగనూరు మండల పరిధిలోని శనివారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో ఒక పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడగా ఆరు పాఠశాలల్లో ఎన్నికలు ముగిశాయి. ఈనెల 8వ తేదీన జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో మండలంలోని గార్లదిన్నె, రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి, వెంకటగిరి, బనవాసి, పరమాన్‌దొడ్డి, ఎర్రకోట పాఠశాలలతో పాటు పట్టణంలోని వెంకటాపురంలోని పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ పాఠశాలలకు విద్యాధికారులు శనివారం ఎన్నికలు నిర్వహించగా ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని ఆరు పాఠశాలల్లో ఎన్నికలు ముగిశాయి. కాగా సిరాలదొడ్డి పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదాపడినట్లు ఎంఈవో మధుసున్‌రాజు తెలిపారు.

గోనెగండ్ల: మండలంలో ఎర్రబాడు, అలువాల గ్రామాల లో విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నికలు మళ్లీ వాయిదా పడినట్లు ఎంఈవో నీలకంఠ తెలిపారు. అలువాల ఎస్సీ పాఠశాల, ఎర్రబాడు ఉన్నతపాఠశాల, బీసీ పాఠశాలలో విద్యాకమిటీ ఛైర్మన్ ఎన్నిక శనివారం జరిపేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయా పాఠశాలలలో విద్యార్థుల తల్లిదండ్రుల కోరం లేక పోవడంతో మళ్లి వాయిదా వేశామని ఎంఈవో తెలిపారు.

అస్పరి: మండలంలోని చిన్నహోతూర్‌లో జడ్పీ, ప్రాథమిక పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మను ఎన్నుకున్నారు. గత వారంలో ఎన్నిక కావాల్సిన ఆ కమిటీలు వాయిదా పడడంతో ప్రస్తుతం టీడీపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రాజ న్న, వైస్ ఛైర్మన్‌గా జయమ్మ, ప్రాథమిక పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్‌లు లక్ష్మీ, కుమార్, వైస్ ఛైర్మన్‌లు కృష్ణ, రాణమ్మ ఎన్నికయ్యారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు మధు, మాజీ సర్పంచ్, వరదరాజులు సన్మానం చేశారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

క్రిష్ణగిరి, ఆగస్టు 17: మండలంలో వాయిదా పడిన చిట్యాల జిల్లా పరిషత్ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ పాఠశాల నూతన యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా లావణ్య, వైస్ ఛైర్మన్‌గా బస్వరాజ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్కసాగరం, పందిర్లపల్లె, తెగదొడ్డి గ్రామల పరిధిలోని పాఠశాలలో ఎన్నికలు కోరం లేకపోవడంతో మరోసారి వాయిదా పడ్డాయి. టీడీపీ నాయకులు గుండాలయ్య గౌడ్,శ్రీధర్ గౌడ్,రఘు గౌడ్,ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.

చిప్పగిరి: శనివారం చిప్పగిరి మండలంలో 11 పాఠశాలలో యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు చారి, సీఐలు శ్రీనివాస నాయక్, రామకృష్ణయ్య, ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌లను ఎన్నుకున్నారు. చిప్పగిరిలోని జడ్పీ పాఠశాల ఛైర్మన్‌గా కుక్క నాగరాజు, కస్తుర్బా పాఠశాల ఛైర్మన్‌గా కే పెద్దక్కలు వైసీపీ మద్దతుదారులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బంటనహాలు పాఠశాల ఛైర్మన్‌గా బీ సరోజ, నగరడోనా ఛైర్మన్‌గా రమేష్ టీడీపీ మద్దతుదారులుగా గెలుపొందారు. నేమకల్లులో మూడు పాఠశాలలు, డేగులపాడులో ఒకటి, చిప్పగిరిలో రెండు పాఠశాలలో ఛైర్మన్‌లుగా టీడీపీ మద్దతు దారులుగా గెలుపొందారు.

వెల్దుర్తి: స్థానిక కేజీబీవీ స్కూల్ యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా నాయకంటి ఎస్తేరమ్మను శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో పాఠశాల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 17: ఎమ్మిగనూరు పట్టణం నుంచి కోడుమూరుకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని శివసర్కిల్‌లో అధ్వానంగా మారిన రహదారిపై సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రహదారి గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సురేష్, కేవీపీఎస్ నాయకులు ఆంథోని, అరుణ్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవం

జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టులు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.



మంత్రాలయంలో జెండా ఎగరవేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు



ఎమ్మిగనూరులోని పూలే అంబేడ్కర్ అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు


ఆలూరులో జెండా ఎగరవేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు


పత్తికొండలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత రామచంద్రయ్య


అనాథలకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు


కోసిగిలో అనాథలకు పండ్లు, బ్రెడ్లు, పాలు అందజేస్తున్న ఏపీయుడబ్ల్యూజే నాయకులు